సాక్షి
పల్నాడు
గురువారం ׀ 11 ׀ జనవరి ׀ 2024



గోవిందనామ జప యజ్ఞ పూజ

తెనాలి టౌన్: పినపాడులోని యోగాచార్యులు మల్లికార్జునరావు ఆధ్వర్యంలో బుధవారం పూజ్యశ్రీ బాలస్వామీజీ పర్యవేక్షణలో గోవిందనామ జపయజ్ఞ పూజలు నిర్వహించారు.



ఎత్తిపోతలకు జలకళ

విజయపురిసౌత్: పర్యాటక ప్రాంతమైన ఎత్తిపోతలకు బుధవారం జల ప్రవాహం పెరిగింది. సాగర్ కుడి కాలువకు నీటిని విడుదల చేస్తుండటంతో జలకళను సంతరించుకుంది.



దుర్గమ్మకు విరాళాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గా మల్లేశ్వరస్వామి వార్లకు విజయవాడకు చెందిన భక్తులు రూ. 3 లక్షలను బుధవారం అందజేశారు.

న్యూస్ రీల్

ఫిబ్రవరిలో జాతీయ సదస్సు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 13, 14వ తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ డాక్టర్ కె.వి.శాంతిశ్రీ తెలిపారు. సదస్సు బ్రోచర్‌ను బుధవారం యూనివర్సిటీ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శాంతిశ్రీ మాట్లాడుతూ 'చట్టసభలలో మహిళా రిజర్వేషన్ రాజకీయ సాధికారతకు ఒక కొలమానం' అనే అంశంపై రెండు రోజులు పాటు ఈ సదస్సు జరుగుతుందన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిన తరుణంలో, ఫిబ్రవరి 13న జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని సదస్సును ఏర్పాటు చేసినట్లు వివరించారు. సదస్సుకు పరిశోధన పత్రాలు సమర్పించేవారు ఫిబ్రవరి 1వ తేదీలోగా పంపాలని సూచించారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్ సైట్ గాని, మహిళా అధ్యయన కేంద్రం విభాగాన్ని గాని సంప్రదించాలని శాంతిశ్రీ పేర్కొన్నారు.

యార్డుకు 72,053 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 72,053 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 70,571 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.20,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 23,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,500 నుంచి రూ.19,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.1,100 నుంచి 21,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 41,837 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కె.శ్రీనివాసరావు తెలిపారు.

ఎన్నికల విధులపై అవగాహన నేడు


నగరంపాలెం: ఎన్నికల విధులపై గుంటూరు జిల్లాలోని పలువురు సీఐలు, రిజర్వ్ సీఐలకు అవగాహన కల్పించనున్నారు. ఈ క్రమంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని సమావేశ మందిరంలో గురువారం సదస్సు నిర్వహించనున్నారు. ఒకే రోజు రెండు విడతలుగా తర్ఫీదు ఇవ్వనున్నారు.

బాహుబలికి వెండి గద బహూకరణ



అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామివారికి హైకోర్టు జడ్జి వంగల వెంకట జ్యోతిర్మయి, శ్రీనివాస్ దంపతులు వెండి గదను బహూకరించారు. బుధవారం 2.48 కేజీల వెండి గదను దేవస్థాన అసిస్టెంట్ కమిషనర్ తల్లాప్రగడ సుభద్రకు అందజేశారు. ఈ సందర్భంగా జడ్జి దంపతులను దుశ్శాలువాలతో సత్కరించారు. దేవస్థాన అర్చకులు, వేదపండితులు, ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 522.70 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 5,088, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 27,244, ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటి మట్టం 828.30 అడుగుల వద్ద ఉంది.

నిమ్మకాయల ధరలు

తెనాలి టౌన్ : గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌లో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ. 2,800, గరిష్ట ధర రూ. 3,900, మోడల్ ధర రూ. 3,400 వరకు పలికింది.

పల్లెవించిన క్రీడోత్సాహం

- ప్రారంభమైన మండల స్థాయి 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు
- తలపడనున్న గ్రామ/వార్డు సచివాలయాల జట్లు
- నియోజకవర్గంలో హోరాహోరీగా ఆటల పోటీలు
- ఒక్కో మండలానికి రూ.25 వేలు మంజూరు



కొమెరపూడిలో హోరాహోరీగా వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న అబ్బూరు-గుడిపూడి జట్లు

సత్తెనపల్లి: గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో దాగున్న ప్రతిభను వెలికి తీసేందుకు గ్రామ/వార్డు స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు 'ఆడుదాం ఆంధ్రా' పేరుతో ప్రభుత్వం నిర్వహిస్తున్న క్రీడా పోటీలు క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని ఉరకలెత్తిస్తున్నాయి. రెట్టించిన ఉత్సాహంతో క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నారు. ప్రతిభ ఉన్న క్రీడాకారుల్ని ప్రోత్సహించాలన్న ప్రధాన లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీల్ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఐదు దశల్లో నిర్వహిస్తున్న ఈ పోటీలకు గ్రామ/వార్డు సచివాలయ స్థాయిలో మొదటి దశ పూర్తి చేసుకుంది. మండల స్థాయి పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా నిర్వహిస్తున్న ఈ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొంటూ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శిస్తున్నారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో సత్తెనపల్లి టౌన్, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ల, రాజుపాలెం, నకరికల్లు మండలాల ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీల సంబరాలు మిన్నంటాయి.

పోటీల నిర్వహణకు నిధులు మంజూరు

'ఆడుదాం ఆంధ్ర'లో భాగంగా ప్రధానమైన క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో పురుషులు, మహిళ విభాగాల్లో పోటీల్ని నిర్వహిస్తున్నారు. ఈ క్రీడా పోటీల నిర్వహణకు ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యమిస్తున్నారు. ఇందులో భాగంగా నిర్వహిస్తున్న ఐదు క్రీడాంశాల్లో గ్రామ/వార్డు సచివాలయ స్థాయిలో ఇప్పటికే పోటీలు విజయవంతంగా పూర్తి చేశారు. రెండో దశ మండల స్థాయి పోటీలకు అవసరమయ్యే క్రీడ సామగ్రిని ఇప్పటికే ప్రభుత్వం సమకూర్చింది. తాజాగా మండల స్థాయిలో పోటీల నిర్వహణ కోసం రూ.25 వేల చొప్పున, నియోజకవర్గానికి రూ.1.25 లక్షలు వంతున నిర్వహణ ఖర్చులు నిమిత్తం మంజూరు చేసింది. ప్రతి మండలానికి కనీసం నాలుగు లేదా గరిష్టంగా ఆరు ఆట స్థలాల్ని సిద్ధం చేసింది.



నందిగామలో బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

పోటీల నిర్వహణ ఇలా

ఈ నెల 23వ తేదీ వరకు మండల స్థాయి, 24 నుంచి 30 వరకు నియోజకవర్గ స్థాయి, 31 నుంచి ఫిబ్రవరి 5 వరకు జిల్లా స్థాయి, ఫిబ్రవరి 6 నుంచి 10 వరకు రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తారు. సత్తెనపల్లి టౌన్‌లో 15 సచివాలయాలు, సత్తెనపల్లి రూరల్ పరిధిలో 19 సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో 133 టీములు మండల స్థాయిలో పోటీ పడుతున్నాయి. బుధవారం నందిగామలో బ్యాడ్మింటన్, కొమెరపూడిలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. గుడిపూడి సచివాలయ జట్టు విజయం సాధించింది.

క్రీడాకారుల నుంచి స్పందన



'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలకు ఊహించని విధంగా క్రీడాకారుల నుంచి స్పందన వచ్చింది. ప్రతి దశలోనూ పోటీల్ని సమర్థంగా నిర్వహించి, విజయవంతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. క్రీడాకారులు కూడా ఉత్సాహంగా పాల్గొంటున్నారు. పోటీల్ని చూసేందుకు ప్రజలు పెద్దఎత్తున వస్తున్నారు.

– కొలిమి షమ్మి, కమిషనర్, సత్తెనపల్లి

విజయవంతంగా పోటీలు



'ఆడుదాం ఆంధ్ర'క్రీడా పోటీలు మొదటి దశ సచివాలయ స్థాయిలో విజయవంతంగా, ప్రతిష్టాత్మకంగా పూర్తి చేశాం. మండల స్థాయి పోటీల్లో కూడా ఎలాంటి లోటు లేకుండా నిర్వహిస్తున్నాం. విజేతలుగా నిలిచిన జట్లు నియోజకవర్గస్థాయిలో పోటీ పడాల్సి ఉంటుంది.

– జి.వి.సత్యనారాయణ, ఎంపీడీవో, సత్తెనపల్లి

లింగంగుంట్ల భూముల
సమస్యకు పరిష్కారం

- పుష్పగిరి పీఠం, రైతుల ఒప్పందం మేరకు భూముల బదిలీ
- తీర్పు వెలువరించిన హైకోర్టు
- సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సహకారం మరువలేనిది
- ఎమ్మెల్యే గోపిరెడ్డి, గ్రామ నాయకుల ప్రశంసలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: గత 74ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న లింగంగుంట్ల పుష్పగిరి అగ్రహారం భూముల సమస్య ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి సహకారంతో పరిష్కారమైందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఈ సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం 2019లో విడుదల చేసిన జీవో 149ని అమలుచేస్తూ పుష్పగిరి పీఠం, రైతుల మధ్య కుదిరిన ఒప్పందం మేరకు భూముల బదిలీ జరగాలంటూ రాష్ట్ర హైకోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. దీనిపై హర్షం వ్యక్తంచేస్తూ బుధవారం సాయంత్రం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో లింగంగుంట్ల గ్రామ రైతులతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నరసరావుపేట మండలం లింగంగుంట్ల గ్రామంలో 1950 నుంచి భూముల విషయంలో గ్రామస్తులు, పుష్పగిరి పీఠం మధ్య వివాదం నడుస్తోందన్నారు. గ్రామస్తుల చేతిలోని 1,784 ఎకరాలు పుష్పగిరి పీఠానికే చెందుతాయని 1985లో సుప్రీం కోర్టు తీర్పు చెప్పిందన్నారు. ఈ మేరకు 2007 నుంచి రిజిస్ట్రేషన్లు ఆగిపోవడంతో గ్రామస్తులకు హక్కులు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అప్పటి నుంచి సమస్య పరిష్కారం కోసం దివంగత వైఎస్సార్, మాజీమంత్రి కాసు వెంకటకృష్ణారెడ్డి, దివంగత స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు తమ వంతు కృషి చేశారన్నారు. అయితే, ఈ పరిష్కారం తన హయాంలో ముఖ్యమంత్రి పేషీ సహకారంతో జరగాలని ఆ దేవుడు రాసిపెట్టాడని తెలిపారు.సమస్య పరిష్కారంలో పుష్పగిరి పీఠ విద్యాశంకర మహాభారతి మహాస్వామి, రిటైర్డు అదనపు డీజీ అరవింద రావు, పుష్పగిరి జీపీ చంద్రమౌళి సహకారం మరువలేనిదని కొనియాడారు. మహాస్వామి అనుమతిలేనిదే ఈ సమస్య ముందుకెళ్లేది కాదని తెలిపారు. హైకోర్టులో సీనియర్ కౌన్సిల్ వీరారెడ్డి, అడిషనల్ ఏజీ పొన్నవోలు సుధాకరరెడ్డి వాదించారని చెప్పారు. ఇప్పటికే భూమిపై ఏ రైతు ఉన్నాడనే దానిపై సర్వే పూర్తి చేసినట్లు వెల్లడించారు. కుదిరిన ఒప్పందం మేరకు రిజిస్ట్రేషన్ విలువలో వ్యవసాయం భూమికి 13శాతం, కొంత వాణిజ్యపరమైన భూమికి 18శాతం, పూర్తిగా వాణిజ్యపరమైన భూమికి 20శాతం పుష్పగిరి పీఠానికి రైతులు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. మాజీ గ్రామ సర్పంచు పొన్నపాటి ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ గత మూడున్నరేళ్ల నుంచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే గోపిరెడ్డి భూముల సమస్య పరిష్కారానికి తీవ్రంగా కృషి చేశారన్నారు. గ్రామ నాయకుడు కామిరెడ్డి నరసిరెడ్డి మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి సహకరించిన పుష్పగిరి పీఠం స్వామితో పాటు అందరికీ గ్రామంలో ఘన సన్మానం నిర్వహిస్తామని పేర్కొన్నారు. హైకోర్టు న్యాయవాది శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 2019లో విడుదలైన జీవో దగ్గర ఆగిన సమస్యను ఎమ్మెల్యే గోపిరెడ్డి సహకారంతో ముందుకు తీసుకెళ్లామని తెలిపారు. సమావేశంలో గ్రామ నాయకులు కామిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గంగుల పెద్దిరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ పొన్నపాటి విజయకృష్ణారెడ్డి, కామిరెడ్డి నాగిరెడ్డి, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇండో–ఇజ్రాయెల్ ప్రాజెక్టు రైతులకు వరం

- రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు
- నకరికల్లు మండలం గుండ్లపల్లిలో శంకుస్థాపన
- లాభసాటి వ్యవసాయంతో రైతుల ఆదాయం పెంచేందుకు ప్రభుత్వం కృషి
- సాగులో ఇజ్రాయెల్ టెక్నాలజీ జోడించడంలో రైతులకు శిక్షణ



ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేస్తున్న ఇజ్రాయిల్ రాయబారి నార్ గిలోన్, వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, హార్టీకల్చర్ అధికారులు

నకరికల్లు: ఇండో – ఇజ్రాయెల్ ప్రాజెక్టు పల్నాడు ప్రాంత రైతాంగం అభివృద్ధికి బాటలు వేస్తుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. నకరికల్లు మండలంలోని గుండ్లపల్లి వద్ద ఇండో–ఇజ్రాయెల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ప్రాజెక్టుకు బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి మంత్రి అంబటి రాంబాబుతో పాటు ఇజ్రాయెల్ రాయబారి నార్ గిలోన్, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు హాజరయ్యారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సాగులో ఉన్న 25రకాల మిరప కాయలతో ఉద్యాన శాఖ ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చినంత ప్రాధాన్యత మున్నెపెన్నడూ చూడలేదని తెలిపారు. పల్నాడు ప్రాంతానికి ఇండో–ఇజ్రాయెల్ ప్రాజెక్టు వరం లాంటిదని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కృషికి తోడు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పట్టుదలతో నకరికల్లు మండలంలో గుండ్లపల్లి వద్ద ఇండో–ఇజ్రాయెల్ ప్రాజెక్టు మంజూరైందని వెల్లడించారు. మిర్చి, వంగ, టమాటా తదితర మొక్కల నారుతో పాటు నాణ్యమైన విత్తనాలు ఇక్కడే తయారు చేస్తారని తెలిపారు. దీని ద్వారా పెద్ద సంఖ్యలో వ్యవసాయ కూలీలకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సహకారం మరువలేనిదని ప్రశంసించారు. పాలిహౌస్‌ల ద్వారా వివిధ రకాల నారు పెంచుతారన్నారు. ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రాజెక్టును రైతులు సద్వినియోగం చేసుకొని అధికలాభాల దిశగా వ్యవసాయం సాగించాలని మంత్రి సూచించారు.

పల్నాడులో గణనీయమైన అభివృద్ధి : ఎంపీ

పల్నాడులో వైఎస్సార్‌సీపీ పాలన ఐదేళ్లలో వ్యవసాయంలో గణనీయమైన అభివృద్ధిని సాధించామని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. పల్నాడు ప్రాంతంతో పాటు సమీప మూడు జిల్లాల రైతులకు అధిక ఆదాయాన్ని ఇండో–ఇజ్రాయెల్ ప్రాజెక్టు తెచ్చిపెడుతుందని పేర్కొన్నారు. గతంలో పంటలు సాగు భారమై రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. దేశంలో చాలా రాష్ట్రాల్లో ప్రాజెక్టు పని చేస్తోందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో లభించే నీటిలో పదో వంతు నీరు ఇజ్రాయెల్‌లో లభించదని, లభించే కొద్దిపాటి నీరు కూడా ఉప్పుగా ఉంటుందన్నారు. అయినప్పటికీ మన కన్నా 2–3 రెట్లు అధికంగా దిగుబడులు ఇజ్రాయెల్ సాధిస్తోందని తెలిపారు. గొప్ప టెక్నాలజీ నేడు అందుబాటులోకి వచ్చిందని, రైతులు కొత్త మెలకువలు నేర్చుకొని వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించాలని ఆయన సూచించారు. కలెక్టర్ ఎల్.శివశంకర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో ఇండో–ఇజ్రాయెల్ ప్రాజెక్టు పని చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జేసీ ఏ.శ్యాంప్రసాద్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, హార్టీకల్చర్ శాఖ కమిషనర్ ఎస్.ఎస్.శ్రీధర్, ఉద్యానశాఖ అధికారి బెన్నీ, వ్యవసాయ సలహామండలి అధ్యక్షులు మాలకొండారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, ఎంపీపీ మేచారపు అనురాధ, జెడ్పీటీసీ సభ్యుడు జూనెబోయిన హరీష్, వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్ కుమార్‌రెడ్డి, సర్పంచ్ జూపల్లి మోషె, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

స్మృతి వనంలో పండుగ వాతావరణం

పటమట(విజయవాడతూర్పు): ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనం నిర్మాణ పనులు తుది దశకు చేరిన సందర్భంగా స్వరాజ్ మైదాన్‌లో పండుగ వాతావరణం నెలకొంది. సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 19న స్మృతి వనం ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపల్ కమిషనర్లు స్మృతి వనం ప్రారంభ పనుల్లో నిమగ్నమయ్యారు. విజయవాడ నగరపాలక సంస్థ సహకారంతో ఏలూరు, చిత్తూరు, రాజమండ్రి, అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులందరూ ఏర్పాట్లు చేస్తున్నారు. రాజమండ్రి నగర పాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్ బుధవారం ఉదయం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనం అందాలను వీక్షించారు. ప్రారంభ వేడుకల కోసం అందరూ ఎదురు చూస్తున్నారని స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి తెలిపారు.

పొగాకు రైతులకు 'సంక్షేమ' రుణాలు

- మిచాంగ్ బాధితుల కోసం పొగాకుబోర్డు నిర్ణయం
- సుమారు పదివేల మంది రైతులకు రూ.10 వేల రుణం
- మిచాంగ్‌లో 17,452 హెక్టార్లలో దెబ్బతిన్న పంట
- గతంలో మాండూస్ తుఫాను బాధితులను ఆదుకున్న బోర్డు
- పొగాకు ఉత్పత్తిదారుల సంక్షేమ నిధి నుంచి రుణం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రాష్ట్రంలో మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో పొగాకు పంట నష్టపోయిన ప్రకాశం, నెల్లూరు, బాపట్ల, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన రైతులకు పొగాకు ఉత్పత్తిదారుల సంక్షేమ నిధి నుంచి రూ.10 వేలు చొప్పున వడ్డీ లేని పంట రుణం ఇవ్వనున్నారు. ఈ నిర్ణయాన్ని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఆమోదించింది. పొగాకు ఉత్పత్తిదారుల సంక్షేమ నిధి సభ్యులు సుమారు పది వేల మంది రైతులకు రూ.10 వేలు చొప్పున రూ.10 కోట్లు పంపిణీ చేసేందుకు అనుమతి లభించింది. గతంలో మాండూస్ తుఫాన్ వల్ల నష్టపోయిన సుమారు 18 వేల మంది రైతులకు కూడా ఇదేవిధంగా వడ్డీ లేని రుణాలను పొగాకు బోర్డు ఇచ్చింది. దీని కోసం పొగాకు పంట నష్టపోయినట్లు రైతులు సెల్ఫ్ సర్టిఫికేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. వర్జీనియా పొగాకు పెంపకందారులు పంట నష్టాన్ని అధిగమించడంతోపాటు తిరిగి పొగాకు పంట సాగు చేసుకునేందుకు దోహదపడుతుంది. గత నెల ఐదో తేదీన బాపట్ల జిల్లాలో తీరం దాటిన మిచాంగ్ తుఫాన్ దాటికి వ్యవసాయ పంటలతోపాటు పొగాకు పంట కూడా దెబ్బతిన్న సంగతి తెలిసిందే. చాలాచోట్ల రైతులు మళ్లీ పంట వేసుకోవాల్సి వచ్చింది. దేశంలో గుజరాత్ తర్వాత అత్యధికంగా పొగాకు పండించే రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. రాష్ట్రంలో మొత్తం 41,549 మంది రైతులు పొగాకు పండించేందుకు రిజిస్టర్ చేసుకున్నారు. 35,589 బ్యారన్లు రిజిస్టర్ అయ్యాయి. 78,166 హెక్టార్లలో పంట వేసేందుకు అనుమతివ్వగా, 75,355 హెక్టార్లలో పంట వేశారు. 132 మిలియన్ కిలోల పంట వస్తుందని అంచనా వేశారు. మొత్తం 14,729 హెక్టార్లలో పంట దెబ్బతింది. అత్యధికంగా పశ్చిమగోదావరి, తూర్పు గోదావరి జిల్లాల్లోనే సుమారు 9411 హెక్టార్లలో పంట దెబ్బతింది. ఈ నేపథ్యంలో రైతులు మళ్లీ పంట వేసుకునేందుకుగాను పొగాకు బోర్డు ఈ నిర్ణయం తీసుకుందని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు 'సాక్షి'కి తెలిపారు. రెండేళ్లుగా పొగాకు రికార్డు స్థాయి ధరలు వస్తున్నాయి. గతేడాది కంటే ఈ ఏడాది సగటున పది శాతానికి మించి ధర అదనంగా లభించింది. ప్రతి ఏటా నవంబర్ నుంచి జనవరి మధ్యలో పొగాకు పంట వేస్తుంటారు. మార్చి నెలాఖరు నుంచి జూన్ వరకూ పంట చేతికి వస్తుంది. ఈ నేపథ్యంలో పంట నష్టపోయిన వారు మళ్లీ వేసుకోవడానికి గడువు ఉండటంతో వారిని ప్రోత్సహించేందుకు రుణాలు ఇవ్వాలని నిర్ణయించారు.

క్లుప్తంగా

అందరి ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం

- జేసీ శ్యాంప్రసాద్
- జగనన్న సురక్ష శిబిరం సందర్శన



నరసరావుపేటలో రోగులతో మాట్లాడుతున్న జేసీ శ్యాంప్రసాద్

నరసరావుపేట: అందరి ఆరోగ్య పరిరక్షణే జగనన్న సురక్ష లక్ష్యమని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా స్థానిక గుంటూరురోడ్డులోని రంగావారి స్ట్రీట్ రెండో వార్డు సచివాలయంలో బాబాపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని బుధవారం పరిశీలించారు. జేసీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శిబిరాలను సద్వినియోగం చేసుకుని మెరుగైన వైద్యం పొందాలని సూచించారు. ఈ శిబిరంలో 204 మందికి పరీక్షలు చేసి మందులను ఉచితంగా అందజేశారు. వీరిలో మహిళలు 158 మంది ఉండగా మగవారు 46 మంది, పిల్లలు ఎనిమిది మంది ఉన్నారు. నలుగు గర్భిణులకు పరీక్షలు చేశారు. వీరిలో 48 మందికి కంటి పరీక్షలు చేసి కంటి వెలుగు కింద నలుగురికి కళ్లజోళ్లు అందజేశారు. చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ స్పందన, జనరల్ సర్జన్ డాక్టర్ ఫణికుమార్, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ జి.హర్షవర్ధన్‌రెడ్డి రోగులను పరీక్షించి వారికి కావాల్సిన మందులను రాశారు. వైద్య సిబ్బంది బీపీ, రక్తపరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. కంటి వెలుగు ప్రోగ్రామ్ అధికారి మురళీకృష్ణ కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డీఎండీహెచ్‌ఓ డాక్టర్ బి.రవి, మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు, నోడల్ ఆఫీసర్ డాక్టర్ కె.హనుమకుమార్ పాల్గొన్నారు.

ప్రజలను ఆనందపరిచేందుకే సంబరాలు

- జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- కన్నాలు వేసే కన్నాలక్ష్మీనారాయణ లాగా డబ్బుకు కక్కుర్తి పడను



పట్టణ స్థాయి ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: ప్రజలను ఆనందపరిచేందుకే సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. స్థానిక సుగాలీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పట్టణ స్థాయి వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీలు బుధవారం నిర్వహించారు. ముగ్గులను మంత్రి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జనసేన, టీడీపీ నాయకులు విమర్శిస్తున్నట్లుగా దీనిని డబ్బులు సంపాదనా కార్యక్రమాలల్లో మేము ఉపయోగించమని, దటీజ్ నాట్ మై క్యారెక్టర్ అని చెప్పారు.

కక్కుర్తి పడే మనస్తత్వం కాదు..

మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ 'ఏదో లాటరీ టికెట్లు అమ్ముతున్నానని, దానిలో ఏదో కోటాను కోట్ల రూపాయలు సంపాదిస్తున్నాననే మాట నా మీద పోటీ చేయడానికి వచ్చినటువంటి వస్తాద్ మాట్లాడిన మాటలు, అటువంటి పిచ్చి పనులు చేసేటటువంటి మనిషిని కాదన్నారు. డబ్బులకు కక్కుర్తిపడే మనస్తత్వం తనకు లేదని' అన్నారు. డబ్బులకు కక్కుర్తి పడటం, పదవులకు కక్కుర్తి పడటం, పార్టీలు మార్చి దేశాన్ని కొల్లగొట్టే పద్ధతుల్లో నేను ఉండనన్నారు. కన్నాలు వేయడం నాకు కుదరదని, అది కూడా గుర్తు పెట్టుకోమని మనవి చేస్తున్నానని అంబటి పేర్కొన్నారు. సంక్రాంతి సంబరాలు రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో జరగని విధంగా నేను చేస్తానని, ఇది నా ఆనవాయితీ అన్నారు. ఇవాళ నుంచి కాదు ఆరు సంవత్సరాల నుంచి చేస్తున్నానని, ఇంకా ఆరు, పది నేను బతికి ఉన్నంత వరకు చేస్తానని స్పష్టం చేశారు. అలాగే వావిలాల గోపాలకృష్ణయ్య వర్ధంతి, జయంతి చేయడం నా బాధ్యతగా భావించి చేస్తున్నాను తప్ప ఆ కన్నాలు వేసే కన్నా లక్ష్మీ నారాయణ లాగా డబ్బులకు కక్కుర్తి పడే వాడిని కాదని కాస్త చెప్పండి ఆ కన్నా లక్ష్మీనారాయణకి అని హితవు పలికారు.

పట్టణస్థాయి విజేతలు..

వివిధ రంగులతో ఆకట్టుకునే రీతిలో మహిళలు రంగవల్లులను తీర్చిదిద్దారు. ముగ్గుల పోటీలకు మొత్తం 66 మంది మహిళలు హాజరయ్యారు. పట్టణస్థాయి పోటీల్లో ప్రథమ స్థానం ఏ పూజిత(10వ వార్డు), ద్వితీయ స్థానం కె.శివకీర్తి (6వ వార్డు), తృతీయ స్థానం పి.పద్మావతి(23వ వార్డు), నాలుగో స్థానం కె.నాగజ్యోతి(15వ వార్డు), ఐదో స్థానం కె.జ్యోతి (31వ వార్డు) కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా వార్డు స్థాయి పోటీల్లోని విజేతలకు మంత్రి అంబటి రాంబాబు చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. పట్టణ స్థాయి విజేతలకు ఈ నెల 12న నియోజకవర్గ స్థాయి ముగ్గుల పోటీల సందర్భంగా బహుమతులు అందించనున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివ ప్రసాద్, పార్టీ నాయకులు ఉల్లంఘుల ప్రసాద్‌బాబు, రేపూడి రవిచంద్ర పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాం

ఎమ్మెల్యే కాసు



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాసు

గురజాల: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని పాత అంబాపురంలో రూ.60 లక్షలతో సిమెంట్ రోడ్డు, రూ.43.6 లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయం, రూ.135 లక్షలతో మంచినీటి కుళాయి కనెక్షన్లు, పలు అభివృద్ధి పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతున్నామని చెప్పారు. నాడు- నేడు గ్రామాల్లో ఎంతో తేడా ఉందని చెప్పారు. గతంలో గ్రామాల్లో సమస్యలు విలయతాండవం చేశాయని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత సమస్యలు పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపడం జరిగిందని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఆరికట్ల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి , వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య, గ్రామ సర్పంచి పాశం హేమలతా , పాశం హనిమిరెడ్డి, పాశం పాపిరెడ్డి, ఆరికట్ల నాగిరెడ్డి, జి.రామకోటమ్మ, పాలువాయి అప్పిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు ఆనం వెంకటప్పారెడ్డి పాల్గొన్నారు.

పల్నాటి చరిత్ర ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి

గురజాల: పల్నాటి వీర చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. స్థానిక బస్టాండ్‌లో డివైడర్‌పై పల్నాడు ప్రాంతాన్ని పాలించిన అనుగురాజు విగ్రహ ఏర్పాటుకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ ప్రముఖుల విగ్రహాలను ఏర్పాటుచేయడంపై ఆనందంగా ఉందని చెప్పారు. చరిత్ర సృష్టించిన వారిని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలో విగ్రహం ఏర్పాటు చేసి పల్నాడు ప్రాంత చరిత్ర ప్రతి ఒక్కరికి తెలిసే విధగా చూస్తామన్నారు. తొలుత పల్నాటి వీర చరిత్ర- వాస్తవాలు కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి, మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి డి.ఏడుకొండలు యాదవ్, వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య, కో ఆప్షన్ సభ్యుడు పీర్ అహ్మద్, పట్టణ కన్వీనర్ కె.అన్నారావు, అనిల్‌కుమార్, దాచేపల్లి మార్కెట్ యార్డు డైరెక్టర్ కె.అంద్రెయ్య, కేబీఎస్ ప్రగతి కోటేశ్వరరావు, కె.గిరిబాబు పాల్గొన్నారు.

పల్నాడులో ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

గురజాల డీఎస్పీ పల్లపు రాజు



పిడుగురాళ్ల: పల్నాడు ప్రాంతంలో ప్రశాంతంగా ఎన్నికలను నిర్వహించటమే లక్ష్యంగా పోలీస్ అధికారులు విధులు నిర్వహించాలని గురజాల డీఎస్పీ ఎ.పల్లపు రాజు అన్నారు. పట్టణంలోని జానపాడు రోడ్డులోని కేఎం కన్వెన్షన్ హాల్‌లో గురజాల సబ్ డివిజన్ పోలీస్ అధికారులకు మోడల్ కోడ్ ఆఫ్ కండెక్ట్ అండ్ ఎలక్షన్ ప్రొసెస్-2024 అనే అంశంపై బుధవారం వర్క్ షాప్ నిర్వహించారు. పిడుగురాళ్ల పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు అధ్యక్షత వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి బైండోవర్ చేయాలని చెప్పారు. సమస్యాత్మకమైన గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ప్రతి గ్రామంలో రెవెన్యూ అధికారులతో, మహిళా పోలీసులతో కో ఆర్డినేట్ చేసుకొని ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత నిర్వహించాల్సిన విధి విధానాలపై అవగాహన సదస్సులను ఆయా గ్రామాల్లో పోలీస్ అధికారులు నిర్వహించాలని సూచించారు. ఎన్నికల కోడ్‌లో ప్రతి సమావేశాలు తప్పనిసరిగా వీడియో తీసుకోవాలని, ప్రతిపక్ష, పాలక పక్షం ప్రధాన నాయకులు ఎన్నికల కోడ్‌లో ఎటువంటి గొడవలకు పాల్పడకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. గురజాల డివిజన్‌లో 1700 వందల బైండోవర్ కేసులతో పాటు అనుమానితులపై 180 కేసులు, పాత నిందితులు, రౌడీషీటర్లు మరిన్ని కేసులు నమోదు చేయటం జరిగిందని తెలిపారు. గురజాల డివిజన్‌లో 36 సమస్యాత్మకమైన గ్రామాలు ఉన్నాయని తెలిపారు.

ఆయా గ్రామాల్లో ప్రత్యేకమైన నిఘా ఉంటుందని తెలిపారు. అలాగే గురజాల డివిజన్‌లో 303 పోలింగ్ స్టేషన్‌లు, మాచర్ల డివిజన్‌లో 296 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని వివరించారు. అనంతరం ఏపీపీ బుగ్గి నరసింహారావు ఎన్నికల కోడ్ సమయంలో పోలీసులు నిర్వహించాల్సిన విధి విధానాలపై అవగాహన కల్పించారు. భద్రత, ఫ్లెయింగ్ స్కాడ్, స్టాటిక్ సర్వెంట్స్ టీమ్స్, ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేయాల్సిన ఇన్నర్ అండ్ ఔటర్ చెక్‌పోస్టులు వంటి అంశాలను వివరించారు. కార్యక్రమంలో దాచేపల్లి, మాచర్ల పట్టణ, మాచర్ల రూరల్, గురజాల పట్టణ, కారంపూడి సీఐలు సురేంద్రబాబు, శరత్‌బాబు, షమీముల్లా, బాలకృష్ణ, జయకుమార్ పాల్గొన్నారు.

వేల్పూరులో పిండమార్పిడి ద్వారా సత్ఫలితాలు



దూడ, జన్మనిచ్చిన ఆవు

అచ్చంపేట: పిండమార్పిడి విధానం ద్వారా సత్ఫలితాలు వస్తున్నాయని పశుసంవర్ధకశాఖ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ ముత్తారావు తెలిపారు. మండలంలోని వేల్పూరులో పిండమార్పిడి విధానం ద్వారా రైతు పొన్నెకంటి వెంకట్రావుకు చెందిన ఆవు ఆరోగ్యవంతమైన దూడను ప్రసవించగా బుధవారం శాస్త్రవేత్తలు, పశువైద్యాధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ ముత్తారావు మాట్లాడుతూ తమశాఖకు చెందిన సీనియర్ పశువైద్యాధికారి డాక్టర్ మల్లయ్య ఆవుకు పిండమార్పిడి విధానం ద్వారా వైద్యసేవలు అందించారన్నారు. వారి సేవలు ఫలించి దూడ జన్మించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ సంచాలకులు డాక్టర్ కాంతారావు, సహాయ సంచాలకులు డాక్టర్ వెంకట్రామయ్య, స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ శ్వాతీదేవి పాల్గొని రైతు పొన్నెకంటి వెంకట్రావును అభినందించారు.

నల్లమల అటవీ ప్రాంతంలో పులి జాడలు

- భయాందోళనలో సమీప గ్రామాల ప్రజలు
- అప్రమత్తమైన అటవీశాఖాధికారులు



పులి అడుగు జాడలను గుర్తిస్తున్న అటవీ అధికారులు

మాచర్ల రూరల్: నల్లమల అటవీ సమీపంలో పెద్ద పులి సంచరిస్తుందని ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ సత్యనారాయణ రెడ్డి బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ అటవీ ప్రాంతం సమీపంలోని పొలాల్లో పెద్దపులి అడుగు జాడలు గుర్తించినట్లు చెప్పారు. సమీప ప్రాంత ప్రజలు బయటకు వచ్చేటప్పుడు జాగ్రత్తలు వహించాలని సూచించారు. రాత్రివేళల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని కోరారు. పొలానికి వెళ్లే రైతులు, కూలీలు గుంపులుగా కలసి వెళ్లాలని కోరారు.

నల్లమల అటవీ ప్రాంత సమీపంలోని నాగులవరం, సుబ్బారెడ్డిపాలెం, అచ్చమ్మకుంట, కొప్పునూరు, విజయపురిసౌత్, అనుపు, రచ్చమల్లపాడు, గుడిపాడు చెరువు తదితర గ్రామాలు, తండాల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. చిన్నారులను బయటకు రాకుండా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. గ్రామాలు, తండాలలో అటవీశాఖ అధికారులు పెద్దపులి సంచరిస్తున్నట్లుగా దప్పు వేయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ వెంకట్రావు, బీట్ ఆఫీసర్ అనిల్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

నెహ్రూనగర్: విజయవాడ స్వరాజ్య మైదానంలో ఈ నెల 19న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్న 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ప్రజలందరూ స్వచ్ఛందంగా తరలిరావాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ కోరారు. బుధవారం ఆర్ అండ్ బీ అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలోనే అత్యంత ఎత్తయిన విగ్రహంతో సముచిత స్థానం కల్పించినందుకు అంబేడ్కర్ అభిమానులు, ప్రజల తరపున సీఎంకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

క్రీడలలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్



నకరికల్లు: క్రీడలలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని పల్నాడు జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ అన్నారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడాపోటీలు బుధవారం ప్రారంభించారు. జాతీయ జెండా, క్రీడాపతాకాన్ని ఆవిష్కరించారు. జేసీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోకి క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు ఆడుదాం ఆంధ్ర క్రీడలు దోహదపడతాయని అన్నారు. క్రీడాస్ఫూర్తితో ఆడి గెలుపోటములను సమానంగా స్వీకరించాలని అన్నారు. మండల స్థాయి క్రీడల్లో రాణించి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ చింతా పుల్లయ్య పాల్గొన్నారు.

కృష్ణానదిలో పడి యువకుడు మృతి



క్రాంతికుమార్ (ఫైల్)

దాచేపల్లి: ప్రమాదవశాత్తు కృష్ణా నదిలో పడి యువకుడు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. ఏఎస్ఐ కృష్ణారావు కథనం.. మండలంలోని తంగెడకి చెందిన పాతుల క్రాంతికుమార్(30) కృష్ణా నదిపై నిర్మించిన నదిపై చేపలు పట్టేందుకు మంగళవారం మధ్యాహ్నం వెళ్లాడు. బ్రిడ్జిపై నుంచి గాలం ద్వారా చేపలు పడుతున్నాడు. ఈ క్రమంలో నదిలో చూస్తు ఒక్కసారిగా నీళ్లలో పడి గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యులు నదిలో గాలింపు చేపట్టటంతో బుధవారం మృతదేహం లభించింది. పోలీసులకు సమాచారం ఇవ్వటంతో ఘటనా స్థలాన్ని ఏఎస్ఐ కృష్ణారావు పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.